నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 12 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- నల్లగొండ డీసీహెచ్ఎస్ డాక్టర్ మాత్మ

విచారణలో పాల్గొన్న డాక్టర్ మాత్మ

చౌటుప్పల్, జూన్ 11 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ డీసీహెచ్ఎస్ డాక్టర్ మాత్మ హెచ్చరించారు. మంగళవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పలు ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. రోగుల నుంచి సిబ్బంది అక్రమ వసూళ్లు చేయడం, వైద్యులు ప్రైవేట్ దవాఖానలు కలిగి ఉండటం, విధులకు సరిగా రాకపోవడం, బయోమెట్రిక్ వాడకపోవడం, కాంట్రాక్టర్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వ్యక్తిగత కొట్లాటలు, ఒకరిపై మరొకరి దూషణలతో అత్యవసర సేవలు నిలిపివేసి సిబ్బంది ధర్నాలు చేయడం తదితర అంశాలపై ఆయన సంబంధిత ఉద్యోగులతో మాట్లాడారు. వారి నుంచి వివరాలు సేకరించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య కమిషనర్ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యులతోపాటు సిబ్బంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విచారించినట్లు చెప్పారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తదుపరి ఫలితాల ఆధారంగా చర్యలు ఉంటాయని తెలిపారు.

వ్యవసాయ శాఖ పని చేస్తున్నదా?

- జీలుగ విత్తనాల్లేవ్.. అవగాహన కూడా కల్పిస్తలేరు
- ఈ సారి ధాన్యం సేకరణలో తీవ్ర ఇబ్బందులు
- సివిల్ సప్లయ్ అధికారుల మాటలు, చేతలకు పొంతనలేదు
- జిల్లాలో రోడ్లు అధ్వానం.. ఇట్లుంటే వానకాలం ఎట్లా..?
- సమస్యలను ఏకరువు పెట్టిన అధికార, ప్రతిపక్ష సభ్యులు
- రోజంతా శాఖలవారీగా అధికారుల నిలదీత

జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం

జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాపరిషత్ చైర్మన్ సందీప్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ జెండగే

యాదాద్రి భువనగిరి, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : 'జిల్లాలో వ్యవసాయ శాఖ పనిచేస్తున్నదా..? లేదా..? అని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరు బాలేదని, ఏఈఓలు సరిగా పనిచేయడం లేదని చెప్పుకొచ్చారు. మండలాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో లేవని వివరించారు. జీలుగ విత్తనాలపై కనీసం అవగాహన కల్పించడంలేదని సమావేశంలో లేవనెత్తారు. పంట బీమాపై విధివిధానాలు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుబంధు ఎన్ని ఎకరాల వరకు డబ్బులు జమ చేశారో చెప్పాలంటూ కోరినా.. తమ వద్ద వివరాలు లేవని అధికారులు చెప్పడంపైనా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటల బోనస్ ఎంత వరకు వచ్చిందని, ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని కోరారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సమాధానం ఇచ్చిన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఏఓ అనూరాధ సమాధానమిస్తూ 23 ఎకరాల వరకు రైతుబంధు జమ అయ్యిందని, 142 ఎకరాలే పంటలు ఎండిపోయాయని వివరించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు వివిధ సమస్యలను వరుసగా ఏకరువు పెట్టారు. శాఖలవారీగా అధికారులను నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యంపైనా ప్రశ్నించారు. ఈ సారి ధాన్యం సేకరణలో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయని సభ్యులు తెలిపారు. ఒక్కో రైతు 2 నుంచి 5 కిలోల తరుగు తీశారని చెప్పారు. జిల్లా పౌర సరఫరా అధికారులు మాటలు చెబుతున్నంతగా ఆచరణలో కనిపించలేదన్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమా..? అధికారుల నిర్లక్ష్యమా..? అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లర్ల వద్ద స్టాక్ ఉందా..? నేరుగా మిల్లులకు వెళ్లి తనిఖీలు చేయడానికి సిద్ధమా..? అని పలువురు సభ్యులు సవాల్ విసిరారు. మరోవైపు జిల్లాలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఇప్పుడే ఇలా ఉంటే వానకాలంలో పరిస్థితి ఏంటని, వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలా ఒక్కో సభ్యుడు ఒక్కో సమస్యను లేవనెత్తి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కాగా జిల్లాలో 12 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఉద్యాన వన శాఖ అధికారి అన్నపూర్ణ తెలిపారు.

సమస్యల ఏకరువు ఇలా..

వానకాలం సాగు ప్రారంభమవుతున్నందున విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, వ్యవసాయ అధికారులతో రైతులకు పచ్చిరొట్ట ఎరువుపై అవగాహన కలిగించాలని, రైతుల క్షేమం కోరి మూసీ పరీవాహకంలో పండే వరి పంటను మిల్లర్లు కొనేలా చర్యలు తీసుకోవాలని, ఈదురు గాలులకు మామిడికాయలు, నిమ్మకాయల పంట నష్టం అంచనాలను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి రైతులను ఆదుకోవాలని సూచించారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులను బోధించేలా చర్యలు తీసుకోవాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో పాఠశాలల వసతులను ఎప్పటికప్పుడు గమనించి పనులు పూర్తి చేయించాలన్నారు. పాఠశాలలు తిరిగి ప్రారంభం అవుతున్నందున పిల్లలకు పరిశుభ్రత, పారిశుధ్య చర్యలతో శుచిగా, శుభ్రంగా మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు చేయించాలని కోరారు. రోడ్ల మరమ్మతులను చేపట్టాలని, మిషన్ భగీరథ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించాలని, మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని, గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతతో ఉండాలని, కొలనుపాక పర్యాటక ప్రాంతం కాబట్టి ఆలేరు కొలనుపాక హైలెవల్ బ్రిడ్జి పనులు చేపట్టాలని కోరారు.

విద్యా సమస్యల కోసం విద్యా కమిషన్ : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

రాష్ట్రంలో ప్రత్యేకంగా విద్యా కమిషన్ వేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, విద్యకు సంబంధించిన సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లవచ్చని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ బడుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చి బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. వర్షాలు ప్రారంభమైనందున రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేయాలని, విద్యార్థుల సౌకర్యం కోసం మారుమూల ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులను నడపాలని తెలిపారు. ఆర్టీసీ బస్సులు అన్ని స్టేజీలలో ఆపాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు.

మీరు చేయలేక.. గత ప్రభుత్వాన్ని విమర్శిస్తరా..? : జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి

ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి కోరారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వంలో తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేదని, రోజుకు 75ఎంటీల నీరు వచ్చేదని, ఇప్పుడు ఎందుకు రావడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం చేయలేక.. పదేపదే గత ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఎలా అని ప్రశ్నించారు. పెండింగ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

బడుల్లో వసతులు కల్పించాలి : ఎమ్మెల్యే కుంభం

విద్యా విధానంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని, విద్యాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రూ. 2 వేల కోట్లు కేటాయిస్తామని వాగ్దానం చేశారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. జూలూరు, సంగెం, సూరెపల్లి బ్రిడ్జిల పనులు, వలిగొండ మూసీ మీద మరమ్మతులు, భువనగిరి-చిట్యాల రోడ్డును 4 వరుసలుగా మార్చడం, గ్రామాల్లో లింక్ రోడ్ల మరమ్మతులు, వలిగొండ, పారుపల్లి, బీబీనగర్ రోడ్ల పనులు, అలాగే బునియాదిగాని కాల్వ, పిన్నాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలు, సాగునీటి పనులకు ప్రతిపాదనలతో నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతామన్నారు.

మూతబడిన బడులను తెరవాలి : ఎమ్మెల్యే మందుల

ముఖ్యమంత్రి విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ప్రతి పల్లెలో పాఠశాల ఉండాలని వారి ఉద్దేశమని, మూతబడిన బడులను తెరవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రజాప్రతినిధులను వంద శాతం భాగస్వామ్యం చేయాలని సూచించారు. మోత్కూర్, అడ్డగూడూరు మండలాల్లో రోడ్ల మరమ్మతులకు సంబంధించి టెండర్లకు ఆహ్వానించి, పనులు చేపట్టాలన్నారు. మోత్కూర్ మున్సిపాలిటీ సంబంధించి పబ్లిక్ హెల్త్ పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. హెల్త్ సబ్ సెంటర్‌ను పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ హనుమంత్ కె. జెండగే, అదనపు కలెక్టర్లు కె.గంగాధర్, పి.బెన్ షాలోమ్, జడ్పీ సీఈఓ శోభారాణి, వైస్ చైర్మన్ బీకూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ సమావేశానికి హాజరైన సభ్యులు

మోగనున్న బడిగంట

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- 9 గంటలకే బడిగంట
- ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలు
- తాజాగా మార్పు చేసిన విద్యాశాఖ
- స్కూళ్లకు చేరిన పుస్తకాలు, యూనిఫామ్స్

భువనగిరి అర్బన్, జూన్ 11: నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో బడిగంట మోగనుంది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు స్కూళ్లకు సెలవులు వచ్చాయి. 2024-25 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాలలను అన్ని వసతులతో సిద్ధం చేశారు. పాఠశాలలను మామిడికొమ్మలు, పూలతో అందంగా తీర్చిదిద్దారు. మొదటి రోజున పండగ వాతావరణంలో పునఃప్రారంభించనున్నారు.

జిల్లాలో 712 పాఠశాలలు

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు 712 ఉండగా 52,446 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటికే జిల్లాకు 47, 292 యూనిఫామ్స్ వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 3,08,910 పుస్తకాలు అవసరముండగా అన్ని పుస్తకాలు పాఠశాలలకు చేరాయి. అమ్మ ఆదర్శ కమిటీలో భాగంగా పాఠశాలల్లో వసతులను ఏర్పాటు చేసేందుకు 558 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో మొదటి విడుతలో 256 పాఠశాలను గుర్తించి వసతులను పూర్తి చేశారు. 302 పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. మొదటి రోజు పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పండుగ వాతావరణంలో ప్రారంభించనున్నారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు.

బడిగంట 9 గంటలకే...

రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత బడుల పని వేళలను పాఠశాల విద్యాశాఖ మార్చడంతో ఉదయం 9 గంటలకే ప్రారంభంకానున్నాయి. గతంలో 9 గంటలకు బడులు ప్రారంభమయ్యేవి. కానీ, అప్పట్లో విద్యాశాఖ మార్పు చేయడంతో ప్రాథమిక పాఠశాలల వేళలను ఉదయం 9:30 గంటలకు మార్చారు. ఒకే ఇంట్లో ఇద్దరు విద్యార్థులుంటే ఒకరిని ఉదయం 9 గంటలకు, మరొకరిని ఉదయం 9:30 గంటలకు బడికి తీసుకెళ్లాల్సి ఉండటంతో తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని, మార్చాలని అప్పట్లో కోరగా బడి పని వేళలను మార్చారు. మళ్లీ ఈ నిర్ణయాన్ని మార్చుకోవడంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు తిరిగి ఉదయం 9గంటలకే ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఒకే ప్రాంగణంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుంటే ఆయా స్కూళ్లు ఉన్నత పాఠశాల వేళలనే పాటించాల్సి ఉంటుంది. ఈ స్కూళ్లు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతాయి. ముగింపు మాత్రం భిన్నంగా ఉంటుంది. మధ్యాహ్నం భోజనం సమయంలో 45 నిమిషాల విరామం ఇస్తారు.

పండుగ వాతావరణంలో పునఃప్రారంభించాలి

తాజాగా బడి వేళల్లో మార్పులు వచ్చాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు ఉండనున్నాయి. జిల్లాలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలు, యూనిఫామ్స్ చేరాయి. అన్ని స్కూళ్లలో మొదటి రోజు స్వాగత తోరణాలను ఏర్పాటు చేసి పండుగ వాతావరణంలో ఈ విద్యా సంవత్సరాన్ని పునఃప్రారంభించాలి.

-కె.నారాయణరెడ్డి, డీఈఓ, యాదాద్రి భువనగిరి జిల్లా

గౌరవాన్ని కాపాడుతారని ఆశిస్తున్నా..

- నాతో పాటు ఐదుగురు డైరెక్టర్లు హాజరుకాకుంటే అవిశ్వాసం వీగిపోతుంది
- బీఆర్ఎస్‌లో నాతోపాటు 9 మంది డైరెక్టర్లు
- నష్టాల్లో ఉన్న బ్యాంకును జాతీయ స్థాయిలో నిలిపా
- మీడియాతో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి

మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నీలగిరి, జూన్11 : నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 19 మంది డైరెక్టర్లలో తనతోపాటు ఉన్న 18 మంది బీఆర్ఎస్ డైరెక్టర్ల నుంచి ఎనిమిది మంది డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరారని, ఇంకా 10 మంది డైరెక్టర్లు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి తెలిపారు. తనపై 14 మంది డైరెక్టర్ల సంతకంతో అవిశ్వాసం ఇచ్చినందున తమలో నుంచి ఆరుగురు గైర్హాజరైతే ఈ నెల 20న నిర్వహించే ఆవిశ్వాసం వీగిపోతుందని చెప్పారు. తన తోపాటు మరో 9 మంది డైరెక్టర్లు బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, వారంతా పార్టీ గౌరవానికి కట్టుబడి తనవెంటే ఉంటారని విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండలోని డీసీసీబీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై 14 మంది అవిశ్వాస నోటీసును జిల్లా సహకార అధికారికి ఇచ్చిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. 107 సంవత్సరాల చరిత్ర కలిగిసిన డీసీసీబీని తాను పాలకవర్గం బాధ్యతలను స్వీకరించే సమయానికి రూ.900 వందల కోట్ల టర్నోవర్ నుంచి ప్రస్తుతం రూ. 2,400 కోట్ల టర్నోవర్‌కు తీసుకొచ్చామన్నారు. 11 శాతంగా ఉన్న ఎన్‌పీఏను 1.83 శాతానికి తీసుకొచ్చి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిపామని తెలిపారు. గత కాంగ్రెస్ పాలక వర్గంలో దేవరకొండ బ్రాంచ్ కుంభకోణం, ఇతర అవినీతి అక్రమాలతో నష్టాల్లో ఉన్న బ్యాంకును తమ పాలకవర్గ సభ్యుల సహకారం, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, రైతుల సహకారంతో అభివృద్ధి పథంలో నడిపించామని ఆడిట్ గణాంకాలే చెపుతున్నాయని చెప్పారు. ఎక్కడ కూడా అక్రమాలకు తావివ్వకుండా బదిలీలను నిర్వహించిన ఘనత తమకే దక్కిందన్నారు. బ్యాంకు ప్రఖ్యాతులను జాతీయ స్థాయిలో నిలబెట్టడం, బ్యాంకు చైర్మన్‌గా జాతీయ స్థాయిలో అవార్డును తీసుకోవడం సంతృప్తినిచ్చిందని తెలిపారు. తమ పార్టీ డైరెక్టర్లు గౌరవాన్ని కాపాడే విధంగా తన వెంటే ఉండనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. డైరెక్టర్లు కలిసి రావాలని కోరారు. ఆయన వెంట డైరెక్టర్లు రంగాచారి, ప్రవీణ్‌రెడ్డి, అప్పిరెడ్డి తదితరులు ఉన్నారు.

మోత్కూరు ఎఫ్‌సీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- సహకార ట్రిబ్యునల్ స్టేను ధిక్కరించిన డీసీఓ
- కాంగ్రెస్ అరాచకపు అవిశ్వాసం చెల్లదు : చైర్మన్ అశోక్‌రెడ్డి

సమావేశంలో పాల్గొన్న డీసీఓ ప్రవీణ్‌కుమార్, పాలకవర్గం సభ్యులు

మోత్కూరు, జూన్ 11 : మోత్కూరు రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో డీసీఓ ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాలకవర్గం సమావేశాలకు హాజరు కాని ఇద్దరు సభ్యులు అవిశ్వాసంలో పాల్గొనేందుకు అర్హత కోల్పోయారంటూ చైర్మన్ అశోక్‌రెడ్డి సహకార చట్టం 21(బి) ప్రకారం సహకార ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి స్టేను తీసుకొచ్చారు. ట్రిబ్యునల్ ఉత్తర్వులను పరిగణలోకి తీసుకోకుండా డీసీఓ అధికార పార్టీ ఒత్తిడి మేరకు తూతూమంత్రంగా సమావేశం నిర్వహించారు. దీనిపై చైర్మన్ అశోక్‌రెడ్డి ట్రిబ్యునల్ ఆదేశాలను పరిగణలోకి తీసుకోవాలని, ఈ నెల 18 వరకు అవిశ్వాసాన్ని వాయిదా వేయాలని వాగ్వాదం చేశారు. ట్రిబ్యునల్‌ను ధిక్కరించిన డీసీఓ సంఘం వైస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, మరో 8 మంది పాలకవర్గం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు సంతాకాలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గీయుల మధ్య ఉత్కంఠ నెలకొంది. అవిశ్వాసానికి మద్దతుగా కాంగ్రెస్‌కు చెందిన సంఘం వైస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, బయ్యని చంద్రశేఖర్, జిట్ట లక్ష్మయ్య, తాళ్లపల్లి స్వామి, కారుపోతుల ముత్యాలు, బుషిపాక సుజాత, బండ పద్మ, ఆకుల వెంకటేశ్వర్లుతో అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తించి ఓటింగ్ నిర్వహించారు. చైర్మన్ అశోక్‌రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్‌కు చెందిన సంఘం సభ్యులు సామ పద్మారెడ్డి, పురుగుల మల్లయ్య, దేవసరి రాములు సమావేశానికి హాజరు కాలేదు. డీసీఓ అధికార పార్టీ ఒత్తిడి మేరకు సమావేశం నిర్వహించి సభ్యుల సంతాకాలు సేకరించి మినిట్స్ బుక్‌లో తన సంతకం చేయకుండానే జాగత్రపడ్డారు.

అరాచకపు అవిశ్వాసం చెల్లదు: అశోక్‌రెడ్డి

కాంగ్రెస్ అధికార దాహంతో తనపై అరాచకపు అవిశ్వాసం పెట్టిందని, అది చెల్లదని సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి అన్నారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అరాచకాన్ని సృష్టించి నిబంధనలు పాటించకుండా అవిశ్వాసం నెగ్గినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సహకార చట్టం నిబంధనలు పాటించకుండా డైరెక్టర్ల పదవులను తొలగించిన వారికి అర్హత కల్పించి కాంగ్రెస్ ఏజెంట్‌గా డీసీఓ ప్రవీణ్‌కుమార్ పని చేశాడన్నారు. 18 వరకు ఉన్న ట్రిబ్యునల్ స్టేను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు.

చేనేత సమస్యలను పరిష్కరించాలి

- రాష్ట్రప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి చేనేత నాయకుల వినతి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 11 : చేనేత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోచంపల్లి చేనేత సహకార సంఘం నాయకులు, కార్మికుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని మంగళవారం హైదరాబాదులో కలిసి వినతిపత్రం అందజేశారు. చేనేత సహకార సంఘంలో రూ.1.50 కోట్ల విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత నవంబర్‌లో టెస్కో నుంచి రావాల్సిన 20 లక్షల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంఘం సభ్యులకు పని కల్పించాలని, ప్రభుత్వ నుంచి సంఘానికి రావాల్సిన రిబేట్ డబ్బులు 73 లక్షలను వెంటనే విడుదల చేయించాలని కోరారు. చేనేత సంఘాలకు పావలా వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం క్యాష్ క్రెడిట్ రుణాలను డీసీసీబీ ద్వారా ఇప్పించాలని, 40శాతం యారన్ సబ్సిడీని చేనేత కార్మికులకు నేరుగా అందజేయాలని, జియో ట్యాగింగ్ కలిగిన వారికి నెలకు 2,500 ఇవ్వాలని, జీవిత బీమా 5 లక్షలకు వర్తింపజేయాలని, బతుకమ్మ చీరలను రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికుల ద్వారా ఉత్పత్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత నాయకులు ఏలె భిక్షపతి, గంజి బసవలింగం, గంజి కృష్ణ, తుమ్మ లక్ష్మీనారాయణ, వర్కాల వెంకటేశం, కూరపాటి వెంకటేశం, కార్మికులు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా

చౌటుప్పల్ : చౌటుప్పల్ చేనేత సహకార సంఘంలో జరుగుతున్న అవినీతిపై మంగళవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించకుండా తెలిసిన వారికే పాలకవర్గం ఆర్డర్ పత్రాలు ఇస్తున్నారని కార్మికులు ఆరోపించారు. ధర్నాలో గోశిక స్వామి, గుర్రం నర్సింహ, గోశిక భిక్షపతి, గోశిక రవి, కర్నాటి జనార్దన్, జెల్ల సుదర్శన్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

15న ఎంజీయూ పీహెచ్‌డీ ఎంట్రెన్స్

- వర్సిటీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల హాల్ టికెట్స్

రామగిరి, జూన్ 11: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పరిశోధనలకు అవకాశం కల్పించే వివిధ సబ్జెక్టులో చేరడానికి పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్ ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వెల్లడించిన నోటిఫికేషన్స్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసిన అభ్యర్థులకు మాత్రమే పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. హాల్ టికెట్స్‌ను www.mguniversity.ac.inలో డౌన్‌లోడ్ చేసుకోవాలని, అభ్యర్థులందరికీ వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రంగా ఉంటుందని తెలిపారు.

పరీక్షలు ఇలా..

- ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు పేపర్ -1 (రిసెర్చ్ మెథడాలజీ)
- సెషన్స్ -2లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు బిజినెస్ మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ
- మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్, కామర్స్
- మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు - గణితం పరీక్షలు వేర్వేరుగా..

అభ్యర్థులు ఇవి గమనించాలి

ఓఎంఆర్ విధానంలో పరీక్ష ఉంటుంది. హాల్ టికెట్, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను తీసుకురావాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష నిర్ణీత సమయం కంటే 30 నిమిషాల ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.

టీఎస్ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

- రాష్ట్ర వ్యాప్తంగా 28,549 మంది ఉత్తీర్ణత

రామగిరి, జూన్ 11: రెండేండ్ల బీఈడీ కోర్సులో ప్రవేశానికి మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీఎస్ ఎడ్‌సెట్-2024 ఫలితాలను మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో విడుదల చేశారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, ఎంజీయూ ఇన్‌చార్జి వీసీ నవీన్‌మిట్టల్, టీఎస్ ఎడ్‌సెట్ కన్వీనర్ మృణాళిని, కోఆర్డినేటర్, ఎన్‌సీటీఈ సభ్యులు పారేపల్లి శంకర్, ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవితోపాటు పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

96.90 శాతం ఉత్తీర్ణత

టీఎస్ ఎడ్‌సెట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 33,879 (5,732 పురుషులు, 28,147 మహిళలు) దరఖాస్తు చేశారు. వీరిలో 29,463 మంది అభ్యర్థులు (4,830 పురుషులు, 24,633 మంది మహిళలు) పరీక్ష రాయగా 28,549మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో 4,769 పురుషులు, 23,780మంది మహిళలు ఉన్నారు. 96.90 ఫలితాలు వచ్చినట్లు సెట్ కన్వీనర్ మృణాళిని తెలిపారు.

నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో 97 శాతం..

నల్లగొండ జిల్లాలో 331 మంది పరీక్ష రాయగా 323 (97.58శాతం) ఉత్తీర్ణత సాధించారు. సూర్యాపేట, కోదాడలో 667 మంది పరీక్షలు రాయగా 652 మంది (97.95శాతం) ఉత్తీర్ణత సాధించారు.

EC VIDYASAGAR ADHARSH